ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి అరుదైన పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న మహావీర్‌సి.జైన్

హైదరాబాద్‌సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అరుదైన పురస్కారం లభించింది. గుర్గావ్‌లోని హయాత్ రెజెన్సీలో జరిగిన ప్రతిష్ఠాత్మక గ్లోబల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్)-ఎన్విరాన్‌మెంటల్ సోషల్ అండ్ గవర్నమెంట్ (ఈఎస్జీ) అవార్డ్స్‌లో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ(ఎల్వీపీఈఐ)కు టాప్ 10 బెస్ట్ ఎన్జీవోస్ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం అందుకుంది. ఎల్వీపీఈఐ తరఫున పబ్లిక్ రిలేషన్స్, డోనర్ ఎఫైర్స్ బృందంలోని మహావీర్ సి.జైన్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. అవార్డు సాధనలో సిబ్బంది అందరి అవిరాళ కృషి, అంకితభావం, దాతలు, భాగస్వాముల అచంచల మద్దతు ఉందని ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ పేర్కొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలపై విద్యాశాఖతోపాటు ఇతర శాఖల అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు బస్తీల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు 15న ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు సంబంధించిన రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్: 9100678543కు ఆగస్టు 3వ తేదీ లోపు పంపాలని సూచించారు. అనంతరం కలెక్టర్, అధికారులు ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కదిరివన్, డీఈఓ రోహిణి, డీఎస్‌ఓ రమేష్, ఈ-డీఎం రజిత, డీపీఆర్‌ఓ ఎం.ఎ కలీం, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా రిప్రెజెంటేటివ్ వినీత్ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉస్మానియా'లో ప్లాస్టిక్ సర్జరీ సేవలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ రోజును పురస్కరించుకుని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ సేవలను సోమవారం ప్రారంభించినట్లు యూనిట్ చీఫ్, ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి తెలిపారు. ఈసేవలు 15వతేదీ వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పెదవి చీలిక, అంగిలి చీలిక, చెవి లేకుండా పుట్టిన పిల్లలు, జోడించిన వేళ్లు, బొటనవేలు లేకపోవడం, కాలిన మచ్చలు, కాలిన వైకల్యాలు, పోస్ట్ ట్రామా మచ్చలు, బొల్లి పాచెస్, కుష్ఠు వ్యాధి సమస్యలు, చేతి, దవడ కణితులు, పెద్ద, చిన్న రొమ్ములు, తల, ముఖ వైకల్యాలకు చికిత్స అందిస్తారని చెప్పారు. ఆస్పత్రిలోని 202 నంబర్ గల ఓపీ గదిలో సోమవారం నుంచి శనివారం వరకు ప్లాస్టిక్ సర్జన్లు చేసే అన్ని రకల ఆపరేషన్లపై అవగాహన కల్పిస్తారని, తర్వాత శస్త్రచికిత్సలు చేస్తారని వివరించారు.

బైక్‌లను దొంగిలిస్తున్న ముఠా అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి

రాయదుర్గం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లు, హోటళ్ల ఎదుట పార్కు చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ముఠాను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నా రు. ఈ మేరకు సోమవారం గచ్చిబౌలి పీఎస్‌లో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి, ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దేవకిషోర్(20), కడియాల వీరవెంకట సత్యనారాయణ(21), ఏసుబాబు(17), సిద్దు(17), దిలీప్(19) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. స్విగ్గీఫుడ్ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తుండటంతో వీరందరి మధ్య పరిచయం ఏర్పడింది. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హాస్టళ్లు, కార్యాలయాలు, ఇళ్లు, హోటళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లను లక్ష్యంగా చేసుకుని దొంగిలించేవారు. వీరిలో ఒకరికి ఓ షోరూంలో టెక్నీకలాన్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో చోరీ చేసిన బైక్‌ల కీసెట్‌లను మార్చేవాడు. వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డారు. అయితే, కొంతమంది వాటి పత్రాలు సరిగా లేకపోవడంతో కొనేందుకు నిరాకరించారు. దీంతో ఈ వాహనాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని ప్లాన్ చేశారు. సోమవారం కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద గచ్చిబౌలి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. వీరు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన 16 బైక్‌లను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ రాంచందర్ తదితరులు

ఎస్సై మృతికి కారకులైన అధికారులను తొలగించాలి

● సీఐ, కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు పెట్టాలి

ఖైరతాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గానికి చెందిన అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ మరణానికి కారకులైన సీఐతో పాటు సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి విలేకరులతో చెరకు రాంచందర్, ప్రతినిధులు మాట్లాడారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన అధికారులు, ఉద్యోగులపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని, సత్వర న్యాయం జరిపేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు కేసును అప్పగించాలన్నారు. మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి గ్రూప్ వన్ ఉద్యోగం ఇవ్వాలని, ఆయన కుటుంబానికి రూ.రెండు కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బేరా బాలకిషన్, మేక వెంకన్న, వైస్ చైర్మన్లు నర్మెట మల్లేష్, గంగాధర్, గడ్డం సత్యనారాయణ, చింతపల్లి కాశబూనాథ్, అచ్యుతయ్య, కృష్ణ, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 కోట్ల విలువైన డ్రగ్స్ ధ్వంసం

● రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాది పట్టుబడ్డ డ్రగ్స్


బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది పలు కేసుల్లో పట్టుబడ్డ గంజాయి తోపాటు పలురకాల డ్రగ్స్‌ను డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. సీపీ తరుణ్ జోషి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, సభ్యులు అడ్మిన్ డీసీపీ పి.ఇందిర, మల్కాజిగిరి ఏసీపీ ఎస్.చక్రపాణి, సీసీఆర్బీ ఏసీపీ రమేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో తుక్కాపూర్‌లోని బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. కమిషనరేట్ పరిధిలో 23 పోలీస్‌స్టేషన్‌లలో ఏడాది వ్యవధిలో పట్టుబడ్డ 3,484 కిలోల గంజాయి. 402 కిలోల నల్లమందు పౌడర్, 14 గ్రాముల ఎండీఎంఏ, 3.50 కిలోల హాష్ ఆయిల్, 45 గ్రాముల మెఫిడ్రిన్, 958 గ్రాముల చరస్, 100 గ్రాముల గంజాయి చాక్లెట్లు మొత్తం కలిపి రూ.5,03,31,783 విలువైన డ్రగ్స్‌ను సోమవారం అధికారులు ధ్వంసం చేశారు.

రోడ్ల పక్కన నిర్మాణ వ్యర్థాలు

● నిబంధనలకు పాతర
● గుట్టుచప్పుడు కాకుండా డెబ్రిస్ డంప్
● అధికారుల పర్యవేక్షణ లోపమే అంటున్న స్థానికులు


దీన్‌దయాళ్ నగర్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కన డంప్ చేసిన వ్యర్థాలు


బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి దీనదయాళ్‌నగర్ వెళ్లే దారిలో రోడ్డు పక్కన డంప్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాలు




భరత్‌నగర్ నుంచి బాలానగర్ వెళ్లే దారిలో ఇండస్ట్రియల్ గేటు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డంప్ చేసిన వ్యర్థాలు

బాలానగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బాలానగర్ రోడ్లు భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిళ్లు ఇష్టానుసారంగా డెబ్రిస్ (నిర్మాణ) వ్యర్థాలను రోడ్ల పక్కన డంప్ చేసి వెళ్తున్నారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి భరత్‌నగర్ వెళ్లే దారిలోని దీనదయాళ్‌నగర్, సనత్‌నగర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఈ డంపింగ్ విచ్చలవిడిగా జరుగుతోంది. ఈ ప్రాంతంలో ఏ రోడ్డు పక్కన చూసినా నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగుట్టలుగా కనిపిస్తున్నాయి. నిర్మాణదారులు వ్యర్థాలను తరలించే ఖర్చును తగ్గించుకునేందుకు గుట్టుచప్పుడు కాకుండా రోడ్ల పక్కన వదిలి వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణ వ్యర్థాలను జనావాసాలకు దూరంగా తరలించాల్సి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్ల పక్కన వ్యర్థాలు డంప్ చేస్తుండడంతో రహదారులపై చెత్తచెదారం చేరి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. రోడ్లకిరువైపులా నిర్మాణ వ్యర్థాలు వేస్తుండడంతో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో నిర్మాణదారులు విచ్చలవిడిగా డంప్ చేస్తూ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారు. రోడ్ల పక్కన గుట్టలుగా ఉన్న వ్యర్థాల కారణంగా వర్షంనీరు వెళ్లలేక పక్కనే ఉన్న దీనదయాల్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్ల పక్కన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ సంపదను కాపాడాలి

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్


జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

దుండిగల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసి ప్రభుత్వ సంపదను కాపాడి, ఆ స్థలాలను ప్రజా అవసరాలకు ఉపయోగించాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బీజేపీ నాయకులతో కలిసి మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్‌తో పాటు దుండిగల్ మున్సిపాలిటీ ప్రాంతంలో కూడా కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు తప్పుడు అనుమతులతో కబ్జాదారులు అన్యాక్రాంతం చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట చెరువులో ఆక్రమణలు కొనసాగుతున్నాయన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు ఎలాంటి స్పందన లేదన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్, నిజాంపేట్ గ్రామంలో సర్వేనెంబర్లు 233/13, 14లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికే సహకరిస్తున్నారని ప్రజలు ఆరోపించారు. ఇలా పభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవీఆర్ లే-అవుట్‌లో 10 పార్కుల ఆక్రమణ, 17 అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలని సతీష్ కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా మహిళా ప్రమోక్ అమలేశ్వరి, సెక్రటరీ అరుణ్‌రావు, ఎల్లస్వామి ఉన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతలో ముందుండాలి: జడ్‌సీ


ఫుట్‌పాత్‌లపై పరిశుభ్రతను పరిశీలిస్తున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రతలో శేరిలింగంపల్లి జోన్ ముందు వరుసలో ఉండేందుకు జీహెచ్ఎంసీ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి సర్కిల్ మాదాపూర్‌లోని జేఆర్‌సి కన్వేషన్ సెంటర్ నుంచి మల్కం చెరువు వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర అధికారులతో కలిసి కాలినడకన పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై చెత్తాచెదారం పేరుకుపోయిందని తెలిపింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నరేష్, ఎస్ఆర్‌పీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


జడ్సీ అపూర్వ్ చౌహాన్‌కు ఫిర్యాదు అందజేస్తున్న ఎస్ఎఫ్ఏలు

జీహెచ్ఎంసీ వైద్యాధికారి తీరుపై జెడ్సీకి ఫిర్యాదు

కూకట్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అడిగినందుకు తమపై కక్షసాధిపు ధోరణితో వ్యవహరిస్తున్న సహాయ వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మూసాపేట సర్కిల్ శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్(ఎస్ఎఫ్ఏ)లు సోమవారం జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. చనిపోయిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులను నియమించే విషయంలో వైద్యాధికారి సాల్మన్‌రాజ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందులో పేర్కొన్నారు. అంతేకాకుండా కార్మికులకు సకాలంలో అందించాల్సిన చీపుర్లు, బ్లీచింగ్ తదితర సామగ్రి అందించడంలోనే ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. సాల్మన్ రాజ్ తీరుపై ఉపకమిషనర్ రమేష్‌కు ఫిర్యాదు చేయడంతో తమపై మరింతగా వేధింపులకు గురి చేస్తున్న వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఏలు జెడ్సీని కోరారు. విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకొంటామని జెడ్సీ వారికి తెలిపారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతిపై ప్రజావాణిలో నిలదీసిన ప్రజలు

కుత్బుల్లాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజావాణిలో ప్రజలు నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా, రోడ్లు ఆక్రమిస్తున్నా వారు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని కమ్యూనిటీస్టు పార్టీ నాయకులు, సూరారంకాలనీ బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు. బీఆర్ఎస్ నాయకుడు పందిరి యాదగిరి మాట్లాడుతూ.. సూరారంకాలనీ దయానంద్‌నగర్‌లో రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, అదేవిధంగా ఎంఎన్‌రెడ్డినగర్, చింతల్‌సాయినగర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, షాపూర్‌నగర్, పేట్‌బషీరాబాద్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై కూడా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా రోడ్లు, దోమలు, కుక్కలు సమస్యలపై వివరించారు. డీసీలు, వి.నర్సింహ, మల్లారెడ్డి, ఈఈ లక్ష్మీగణేష్‌లు పాల్గొన్నారు.



ప్రజావాణిలో కమిషనర్‌ను నిలదీస్తున్న పందిరి యాదగిరి, ప్రజలు

శంకరమఠంలో కోటి కుంకుమార్చన


ప్రవచనాలు చెబుతున్న కిరణ్మయి

కూకట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరనగర్‌లోని శృంగేరీ శారదా శంకరమఠంలో మూడు రోజులుగా జరుగుతున్న 'కోటి కుంకుమార్చన' కార్యక్రమంలో భాగంగా సోమవారం నిట్టల కిరణ్మయిచే 'శ్రీదేవి భాగవత నవాహ్నిక జ్ఞాన యజ్ఞమహోత్సవం' ప్రవచనం నిర్వహించారు. ఈ ప్రవచనాలు జూలై 16 వరకు రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అయ్యప్ప జేఏసీ సమావేశం

చందానగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో 11 జిల్లాల నుంచి 250 మంది గురుస్వాములు పాల్గొన్నారు. సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఇరుముడులతో వెళ్తున్న భక్తులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. అరుణ్‌గురుస్వామి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్ గురుస్వామి, ఆలయ ధర్మకర్తలు రవి, సత్యనారాయణ, రామచంద్రరావు, శ్రీనివాస్, జ్యోతిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వనమహోత్సవం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో మంగళవారం నుంచి వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జోనల్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సిపురం, పటాన్‌చెరు, యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలో దాదాపు పది ప్రాంతాల్లో 10 వేల మొక్కలు నాటేందుకు స్థలాలు సిద్ధం చేశామన్నారు.


పరికి చెరువు వివరాలు సేకరిస్తున్న అధికారులు

కబ్జాకు గురవుతున్న పరికి చెరువును పరిశీలించిన అధికారులు

జీడిమెట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్ ప్రాంతంలో కబ్జాకు గురవుతున్న పరికి చెరువును జీహెచ్ఎంసీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సందర్శించి పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు సీసీరోడ్లు నిర్మిస్తున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ప్రశ్నించడంతో పాటు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఐపీఎస్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఏఈ అజేష్ స్థానిక టీపీఎస్ సంగీతతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ స్థలం తమదని కొందరు వ్యక్తులు రావడంతో 'చెరువు స్థలం మీది ఏవిధంగా అయిందో డాక్యుమెంట్లు తీసుకురావాలి' అని కోరారు. రోడ్డు నిర్మాణం నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పూర్తిస్థాయిలో పరికిచెరువు సర్వే నిర్వహించి కబ్జాదారులపై చర్యలు తీసుకోడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతోందని, చెరువులో అక్రమ నిర్మాణాలను కూలివేయడానికి తగు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు జాతీయ విద్యార్థి దినోత్సవం : ఏబీవీపీ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం విద్యార్థి ఉద్యమం ప్రారంభమై 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ యూనివర్సిటీల విభాగం కన్వీనర్ జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండా కోసం ప్రాణాలర్పించిన 48మంది అమరులకు జోహార్లు అర్పించనున్నట్లు వివరించారు. విద్యార్థుల కోసం నిరంతరం ఏబీవీపీ పనిచేస్తున్నదని పేర్కొన్నారు. 76 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఏబీవీపీకి 54,85,514 మంది సభ్యులు ఉన్నారని జీవన్ తెలిపారు.

ఇండోర్ స్టేడియం స్థలం కబ్జా


కబ్జాచేసి కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్న స్థలం

జీడిమెట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని అపురూపాకాలనీ, ఎస్ఆర్ నాయక్‌నగర్ మధ్యలో ప్రభుత్వం కోటిరూపాయల నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియానికి కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జాచేస్తుండటంతో స్థానికులు జీహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. వేణు అనేవ్యక్తి ఆ స్థలాన్ని కబ్జాచేసి కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నాడని, కబ్జాను అడ్డుకోవాలని స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని డీసీ నర్సింహ తెలిపారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు నేపాల్‌లో జరిగిన గేమ్స్ ఇంటర్‌నేషన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆరు బంగారు, రెండు సిల్వర్ పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. క్రీడల్లో రాణించిన సాయిహస్విక, సర్దార్ సిద్ధూసింగ్, సురేందర్, సంతోష్, అరుణ్‌కుమారులు సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, భాస్కర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి


అయ్యప్ప సొసైటీలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

కూకట్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ జయంతి సందర్భంగా సోమవారం కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్‌బస్టాపు వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శేరి సతీష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, పీసీసీ అధికారప్రతినిధి సత్యం శ్రీరంగం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమారు 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా బాలాజీనగర్‌లోని వైఎస్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు బండి రమేష్, గూడెపు నాగరాజు, జిట్టా సునీల్ కుమార్‌యాదవ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణరాజ్‌పుత్, రాహుల్ సింగ్, హరి, జాంగీర్, సుశీల్, శ్రావణ్ పాల్గొన్నారు.

● 75వ జయంతి వేడుకలు

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి జయంతి సోమవారం నిర్వహించారు. పాపిరెడ్డినగర్, మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని వైఎస్ఆర్ విగ్రహాలకు నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు.


కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్‌బస్టాపు వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బండి రమేష్, సత్యం శ్రీరంగం, శేరి సతీష్‌రెడ్డి తదితరులు

● కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడోఫేజ్ రమ్యగ్రౌండ్ వద్ద సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి పురస్కరించుకొని వైఎస్ఆర్ అభిమాన సంఘం నాయకులు గాలిరెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): డ్యూటీకి సరిగ్గా రాకపోవడంతో యాజమాన్యం విధులు మానెయ్యాలని అనడంతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా మహబూబాబాద్‌కు చెందిన మహాలోక్ బుక్యా(59) బతుకు దెరువు నగర శివారులోని కొంపల్లి మున్సిపల్ పరిధిలోని శివాలయం సమీపంలో నివాసం ఉంటూ బిగ్‌బాస్కెట్‌లో హౌజ్‌కీపింగ్ పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఈనెల 7న విధులకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చి డ్యూటీకి వెళ్లిన భార్యకు పురుగుల మందు తాగానని చెప్పగా డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన ఆమె భర్తను చికిత్స నిమిత్తం కండ్లకొయ్యలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ చేసిన ఇద్దరి రిమాండ్



సంజయ్ ఉమేష్

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రి ముందుఉన్న నల్లపోచమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి వెయ్యిరూపాయాల నగదును స్వాధీనం చేసుకున్నారు. జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం. భూపాల్‌పల్లికి చెందిన కె.సంజయ్(25), మహారాష్ట్ర ప్రాంతంలోని గడ్చిరోలికి చెందిన బి.ఉమేష్(23)లు గత శనివారం నల్లపోచమ్మ ఆలయం తలుపులు పగలగొట్టి హుండీని దొంగిలించుకుపోయారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా సోమవారం ఇద్దరు వ్యక్తులను ఎన్ఎల్‌బినగర్‌లో అరెస్ట్ చేశారు. వెయ్యిరూపాయాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.